సాక్షి ఖమ్మం

మంగళవారం । 13 । మే । 2025



బాల్‌బ్యాడ్మింటన్‌కు కేరాఫ్‌గా..

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు బోనకల్ కేరాఫ్‌గా నిలుస్తుండగా ఈ వేసవిలోనూ పలువురు శిక్షణ పొందుతున్నారు.

8లో



అందుబాటులోకి విత్తనాలు..

భూసారం పెంపునకు సాగు చేసే పచ్చిరొట్ట పంటల విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

నర్సుల సేవలు వెలకట్టలేనివి..



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం: ఆస్పత్రుల్లో నర్సుల సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచ నర్సింగ్ దినోత్సవాన్ని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓలు రాంబాబు, రాథోడ్ వినాయక్‌తో కలిసి ప్రిన్సిపాల్ కేక్ కట్ చేసి మాట్లాడారు. వ్యాధులతో బాధపడే వారికి స్వస్థత చేకూర్చడంలో వైద్యులతో సమానంగా నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. నర్సింగ్ సూపరింటెండెంట్లు శాంతకుమారి, ఇందిరమ్మతో పాటు రత్నకుమారి, జి.లక్ష్మి, ఎమేలియా మేరి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్



భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కళాశాల్లో సీటభర్తీ కోసం ఈనెల 15న బాలికలకు, 16న బాలురకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉదయం 9గంటలకు మొదలయ్యే కౌన్సెలింగ్‌కు 2024–25లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94909 57271, 94909 57270 నంబర్లలో సంప్రదించాలని పీఓ తెలిపారు.

ఆన్‌లైన్‌లో వివరాలు తప్పనిసరి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసీ అధికారులు పూర్తి వివరాలతో రికార్డులు నిర్వహించాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి ఆదేశించారు. ఆస్పత్రులు, సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్లకు కలెక్టరేట్‌లో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణకు పంపిణీ చేసే మందులు, అవసరమైన స్టాక్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే, అర్హులైన దంపతులకు కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, డెమో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

25 శాతం రాయితీతో

ఈనెల 31వరకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించే గడువును ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు పొడిగించింది. ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ఈనెల 3తో ముగియగా.. మరోసారి పెంచుతూ ప్రభుత్వ కార్యదర్శి కె.ఇలంబర్తి పేరిట సోమవారం ప్రకటన విడుదలైంది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు 25శాతం రాయితీ పొందేందుకు మరో అవకాశం లభించింది. తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల నుండి ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.


పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి

ఖమ్మం రాపర్తినగర్: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన పౌర రక్షణ వలంటీర్లుగా నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నందున యువత సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువక కేంద్రం ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.అన్వేష్ సూచించారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషించే అవకాశమున్నందున యువత ముందుకు రావాలని సూచించారు. ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, విపత్తు ప్రతిస్పందన, పునరావాస ప్రయత్నాల్లో తోడ్పాటులో యువతకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వివరాల కోసం htpps// mybharat. gov. in లేదా 94913 83832 నంబర్‌లో సంప్రదించాలని డీడీ ఓ ప్రకటనలో సూచించారు.

అంతులేని నిరీక్షణ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పోస్టులపై కార్యకర్తల నుంచి నేతల వరకు పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఏడాదిన్నరలో కొన్ని పోస్టులు భర్తీ చేసినా ప్రాధాన్యత ఉన్న చాలా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. జిల్లా స్థాయిలో ప్రతిష్టాత్మకంగా భావించే 'సుడా' చైర్మన్ పదవిని ఎవరికీ కట్టబెట్టలేదు. ఇక కొన్ని మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థ, దేవాదాయ కమిటీలు, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీ జరగక ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. ఎన్నికల పేరుతో కొన్నాళ్లు గడిచిపోగా.. కొన్ని మినహా పోస్టుల భర్తీపై దృష్టి పెట్టడం లేదని వాపోతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



'సుడా' పీఠం కోసం..

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవితో సమానమైన సుడా (స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ పదవి హాట్‌కేక్‌గా మారింది. గతంలో సుడాపై నేతలు ఎవరూ ఆసక్తి చూపలేదు. కానీ ప్రస్తుతం సుడా పరిధి పెరగడం.. రాజకీయంగా, ఆర్థికంగా ప్రాధాన్యత ఉన్న పదవి కావడంతో కీలక నేతలు కన్నేశారు. ఈ పదవి దక్కించుకునేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మద్దతు కోసం నేతలు తహతహలాడుతున్నారు. ముగ్గురు మంత్రులు ఏకాభిప్రాయంతో చైర్మన్ ఎంపిక చేయాల్సి ఉందని తెలుస్తోంది. దీంతో ఎవరికి ఆశీస్సులు దక్కుతాయోనన్నది తెలియడం లేదు. అయినా ఎవరికి వారు అనుచరులు తమకే పదవి కట్టబెట్టాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు

- 'సుడా' వైపు ఎక్కువ మంది చూపు
- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులపైనా జిల్లా నేతల కన్ను
- రెండు మార్కెట్ కమిటీలతో పాటు ఖాళీగా ఇంకొన్ని పోస్టులు

ఊరించి.. ఉసూరుమనిపిస్తూ..

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొన్ని కమిటీలను రద్దు చేశారు. దీంతో ఆయా పదవులు తమకు దక్కుతాయని కాంగ్రెస్‌లోని ఆశావహులు భావించారు. ఇందులో భాగంగా భర్తీ చేసిన పోస్టుల్లో ఉమ్మడి జిల్లా నేతలు ఐదుగురికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. ఆ తర్వాత పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. దసరా, సంక్రాంతి తదితర పండుగలు వచ్చినప్పుడల్లా ఆశావహుల్లో ఉత్సాహం నెలకొనడం.. పండుగలు వెళ్లాక నిరుత్సాహపడడం సహజంగా మారింది. జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులపైనా జిల్లా నేతలు ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఇప్పటికే ఐదు పదవులు కట్టబెట్టినందున ఇంకొన్ని కేటాయిస్తారా, లేదా అన్న మీమాంస నెలకొంది.

ఒక్కొక్కటిగా మార్కెట్ పదవులు

జిల్లాలో ఎనిమిది వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. ఇందులో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కల్లూరు, మద్దులపల్లి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమించారు. ఇంకా వైరా, ఏన్కూరు కమిటీలు పెండింగ్ ఉండగా.. ఏన్కూరు మార్కెట్ ఏజెన్సీ పరిధిలో ఉండడంతో పాలక మండలి నియామకంపై సందిగ్ధత నెలకొంది. ఇది కాక మిగిలిన వైరా కమిటీపై నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతల్లో విపరీతమైన పోటీ నెలకొంది.

వీటి ఊసే లేదు..

జిల్లాస్థాయిలో చాలా నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఎప్పటి నుంచో భర్తీకి నోచుకోకపోగా, పలువురు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో ఎన్నో సుప్రసిద్ధ దేవాలయాల కమిటీలు కూడా భర్తీ కావడం లేదు. దీంతో ఆశావహులు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, రాష్ట్రస్థాయిలో నేతలను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి సారించారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినందున త్వరగా పదవులు కేటాయించకపోతే నేతల్లో అసంతృప్తి పెరిగే అవకాశముందని పార్టీలో చర్చ జరుగుతోంది.

రిటైనింగ్ వాల్‌తో శాశ్వత రక్షణ



మున్నేరు వద్ద రిటైనింగ్ వాల్ పనులపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

- నిర్వాసితుల కోసం 'రివర్ ఫ్రంట్' కాలనీ
- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం అర్బన్/ఖమ్మం రూరల్: మున్నేరు నదీ పరీవాహక ప్రాంత ప్రజలు వరదలతో ఇబ్బంది పడకుండా శాశ్వత పరిష్కారానికి రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులతో కలిసి సోమవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదతో మున్నేరు పరీవాహక ప్రాంతంలో వేలాది కుటుంబాలు ఇబ్బంది పడ్డాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఇరువైపులా 17 కి.మీ. పొడవుతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందుకోసం రూ.676 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు4,155 మీటర్ల ఎర్త్‌వర్క్, 3,495 మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కాగా, నిర్మాణంలో భూమి కోల్పోయే నిర్వాసితుల కోసం రివర్ ఫ్రంట్‌లోనే పోలేపల్లి వద్ద కాలనీ ఏర్పాటుచేసి ఇంటి స్థలాలు కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు. అనంతరం జలగం నగర్, నాయుడుపేట వద్ద తీగల వంతెన నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి పరిశీలించి నాణ్యతపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు ఎం.వెంకటేశ్వర్లు, యాకూబ్, ఆర్డీఓ జి.నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు యుగంధర్, వాణిశ్రీ, రంజిత్‌కుమార్, రమేష్‌రెడ్డి, పి.రాంప్రసాద్, అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ – బీఆర్‌ఎస్‌ది ఉమ్మడి నాటకం..

ప్రజలను మభ్యపెట్టేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు ఉమ్మడిగా నాటకానికి తెర లేపారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అప్పులపై ఓ పార్టీ నేతలు రాసిన స్క్రిప్ట్‌ను ఇంకో పార్టీ నేతలు బయటకు చెబుతున్నారని అన్నారు. రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించాక ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంపై రూ.8.19 లక్షల కోట్ల అప్పు ఉందనే విషయాన్ని అసెంబ్లీలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించారని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు హద్దు మీరి విమర్శలు చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని, 90 శాతం పనులు చేశామని చెబుతూ, ఇంకా 40 శాతం మిగిలాయని వెల్లడించడం గర్హనీయమని పేర్కొన్నారు.

మసీదుల అభివృద్ధికి నిధులు

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మసీదుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.లక్ష చొప్పున 18 మసీదులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి చెక్కులు అందజేశాక మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్‌తో పాటు యాకూబ్‌పాషా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా భూసేకరణ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం తదితర పనులకు ప్రణాళికాయుతంగా భూసేకరణ చేపట్టాలని, తద్వారా అభివృద్ధి పనుల్లో వేగం పెరుగుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి భూసేకరణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకానికి అటవీ భూమి ఎంత సేకరించాలో నివేదిక ఇస్తే ప్రత్యామ్నాయ భూముల్లో అటవీ పెంపకానికి చర్యలు తీసుకుంటామన్నారు. భూముల సర్వేను ఆధునిక యంత్రాలతో చేపట్టేలా నివేదిక ఇవ్వాలని సూచించారు. అలాగే, మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం, నిర్వాసితుల కోసం లేఔట్ కాలనీకి ఏర్పాటుకు భూమి సేకరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు

ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదు, వినతిపత్రాన్ని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు.

భూసమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందిన భూసమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పైలట్ మండలాలుగా ఎంపికైన మండలాలకు సంబంధించి జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని, ఏదైనా దరఖాస్తు తిరస్కరిస్తే అందుకు కారణాలు తెలియజేయాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి వీసీలో పాల్గొనగా కలెక్టర్ మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో 3,224 దరఖాస్తులు రాగా, వీటి పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వారం నుంచి పది రోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈసమావేశాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓలు జి.నర్సింహారావు, ఎల్.రాజేందర్ గౌడ్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వైభవంగా చండీహోమం

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతిపూజ తర్వాత హోమం, చివరన పూర్ణహుతి నిర్వహించారు. హోమంలో పాల్గొన్న 17 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత, శారీరక అభివృద్ధి

కొణిజర్ల: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఏకాగ్రత పెరగడమే కాక శారీరక అభివృద్ధి సాధ్యమవుతుందని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేసిన డీవైఎస్‌ఓ మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యకరమైన జీవన శైలి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు శ్రీనివాస్, రంజాన్, ఉపాధ్యాయులు భాస్కర్‌రావు, గోపాలరావు, అచ్యుతరావు, రాంబాబు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి

నేత్రపర్వంగా నృసింహుడి కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని స్వయంభూ శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం (గుట్ట)లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు మొదలుకాగా, స్వామి మూలవిరాట్‌కు 108 కలశాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామిని అలంకరించి, తలంబ్రాలు కలిపారు. అనంతరం మధ్యాహ్నం సుదర్శన యాగం నిర్వహించారు. సాయంత్రం ముత్యాల తలంబ్రాల ఊరేగింపు, ఎదుర్కోలు ఉత్సవం తర్వాత రాత్రి 7గంటలకు అర్చకులు కల్యాణ క్రతువు జరిపించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహనరావు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం జరిపించాక స్వామి వారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కమనీయం.. నృసింహ కల్యాణం

శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనృసింహ స్వామి వారి తిరు కల్యాణ వేడుక వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం కమనీయంగా జరిగింది. మొదట విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించిన అర్చకులు.. వేద మంత్రాల నడుమ కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

వాహనం కదలదు.. కల్తీ ఆగదు...

- రోడ్డెక్కని ఆహార తనిఖీ వాహనం
- అయినా ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్‌కు వేతనాలు
- జిల్లాలో కల్తీ ఆహారంపై కొరవడుతున్న నియంత్రణ

ఖమ్మంమయూరిసెంటర్: ఆహారంలో నాణ్యత పరిశీలన, అక్కడికక్కడే తనిఖీలు చేపట్టేందుకు వినియోగించాల్సిన టెస్టింగ్ ల్యాబ్ వాహనం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని చెత్త వాహనాల పార్కింగ్ స్థలానికే పరిమితమైంది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో తనిఖీలు, కల్తీ ఆహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లతో ఈ వాహనాన్ని కేటాయించింది. ఖమ్మం కేంద్రంగా జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో దీన్ని వినియోగించాల్సి ఉండగా, నెలల తరబడి బయటకు తీయడం లేదు. అంతేకాక డ్రైవర్, టెక్నీషియన్‌కు నెలనెలా వేతనాలు ఇస్తుండడం గమనార్హం.

అప్పుడప్పుడు.. గుర్తొచ్చినప్పుడే

కల్తీ ఆహారం, కల్తీ పదార్థాలకు అడ్డుకట్ట వేసేలా కేంద్ర ప్రభుత్వం మైక్రో బయాలజీ ల్యాబ్ యూనిట్ కలిగిన స్పాట్ కల్తీ టెస్టింగ్ మొబైల్ వాహనాన్ని జిల్లాకు కేటాయించింది. 2022 జూలైలో ఈ వాహనం చేరుకోగా, ఇప్పటి వరకు అధికారులు సక్రమంగా వినియోగించలేదు. ఏటా ఒకసారి, లేదా అధికారులకు గుర్తుకొచ్చినప్పుడు బయటకు తీసి అదే రోజు మూలన పెడుతున్నారు. ఈ వాహనానికి కేటాయించిన డ్రైవర్, ల్యాబ్ టెక్నీషియన్‌కు మాత్రం నెలనెలా ప్రభుత్వం నుంచి వేతనాలు ఇస్తూ, వాహనం డ్రైవర్‌ను ఓ అధికారి తన సొంత వాహనానికి ఉపయోగించుకుంటున్నట్లు తెలిసింది.

కల్తీని కనిపెట్టేలా..

కల్తీ ఆహారంపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు అందినప్పుడు అధికారులు మైక్రో బయాలజీ ల్యాబ్ యూనిట్ కలిగిన వాహనం ద్వారా క్షేత్రస్థాయికి చేరుకోవాలి. అక్కడికక్కడే అనుమానిత ఆహార పదార్థాలను తనిఖీ చేసి కల్తీని నిర్ధారించాల్సి ఉంటుంది. అంతేకాక ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా ఇందులోని ప్రాజెక్టర్లు, పిక్చర్ వాల్స్ వినియోగించాలి. వీటికి తోడు వ్యాపారులకు రిజిస్ట్రేషన్, లైసెన్స్ మంజూరుకు కూడా అవకాశముంది. ఈ వాహనంలో జనరేటర్‌తో పాటు సేకరించిన శాంపిళ్లు చెడిపోకుండా ఆధునిక పరికరాలు, ఏసీలు ఏర్పాటు చేసినా కొన్ని పరికరాలు పని చేయడంలేదని తెలిసింది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ఈ వాహనాన్ని వినియోగించాల్సి ఉన్నా కనీసం ఖమ్మంలో ఫిర్యాదులు అందినప్పుడు కూడా పరీక్షలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

అవగాహన శూన్యం

జిల్లాలో ఆహార కల్తీపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు కల్తీ ఆహారాన్ని పరీక్షించడంపై అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదు. అడపా దడపా హోటళ్లు, దుకాణాల్లో తనిఖీ చేస్తున్నా అవగాహన కల్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో కల్తీ ఆహారం వెలుగులోకి వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలనే అంశంపై ప్రజలకు తెలిచడం లేదు. ఈ విషయమై జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా.. వాహనాన్ని తిప్పుతున్నామని, టెక్నీషియన్, డ్రైవర్లకు నెలనెలా వేతనాలు ఇస్తున్నామని చెప్పడం గమనార్హం.




కేఎంసీ కార్యాలయంలో పార్కింగ్ ప్రదేశంలో నిలిపిన వాహనం

నిప్పుల కుంపటిలా జిల్లా..

వైరాలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. సూర్యప్రతాపంతో జనం విలవిల్లాడుతున్నారు. దాదాపు జిల్లా అంతటా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో మధ్యాహ్నం వేళ రహదారులు బోసిపోతున్నాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నానికి తీవ్రరూపం దాలుస్తుండగా, సాయంత్రం దాటినా వేడి తగ్గడం లేదు. సోమవారం అత్యధికంగా వైరా(ఏఆర్‌ఎస్) వద్ద 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, పమ్మిలో 42.8, వైరా, ఉర్నవల్లి, తల్లాడలో 42.6, బాణాపురంలో 42.5, ఖమ్మం ఖానాపురంలో 42.3, ఎర్రుపాలెం, గౌరారం, చింతకానిలో 42.2, పెద్దగోపతి, నేలకొండపల్లిలో 42.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కల్లూరు, పెనుబల్లిలో 41.9, గంగారం, కొణిజర్లలో 41.8, పల్లెగూడెంలో 41.6, మధిర 41.4, ఖమ్మం ప్రకాష్‌నగర్, ఏన్కూరు, గుబ్బగుర్తిలో 41.3, బచ్చోడు 41.2, ఖమ్మం ఎన్ఎస్‌టీ గెస్ట్‌హౌస్, రఘునాథపాలెంలో 41.1, తిమ్మారావుపేట, కూసుమంచి, మంచుకొండలో 41, వేంసూరులో 40.9, గేటు కారేపల్లి, లింగాలలో 40.7, సత్తుపల్లి, ముదిగొండలో 40.6, సిరిపురం, సత్తుపల్లి ఓసీల వద్ద 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు నివేదిక విడుదల చేశారు. మంగళవారం కూడా ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని తెలిపారు.



క్లుప్తంగా

రేపు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం పర్యటించనున్నారు. మండల కేంద్రంలో రూ.22 కోట్లతో నిర్మించే 50 పడకల ఆస్పత్రి భవనం, రూ.2.62కోట్లతో కండ్రిక – పెద్ద గోపవరం బీటీ రోడ్డు పనులు, రూ.5.74 కోట్లతో నిర్మించే బనిగండ్లపాడు – బంజర బీటీ రోడ్డు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్‌శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

పంటల సాగులో మెళకువలపై అవగాహన


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రవికుమార్

వైరారూరల్: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగామండలంలోని ఖానాపురం రైతు వేదికలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతు యూరియా వాడకం తగ్గింపు, తద్వారానేల ఆరోగ్య పరిరక్షణపై వివరించారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ వివిధ అంశాలపై మాట్లాడారు.ఏఓ మయాన్ మంజుఖాన్, తల్లాడ వెటర్నరీ వైద్యులు అనాస్, విత్తన అభివృద్ధి అధికారి అక్షిత, ఏఈఓలు సపావత్ సైదులు, ఆలూరి వాసంతి, వెంపటి కీర్తి, మేడా రాజేష్, పరిటాల వెంకటనర్సయ్యతో పాటు నల్లమల వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, షేక్ లాల్ మహ్మద్, తుమ్మల రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

మధిర: రైతులు పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని మధిర వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణిదేవి సూచించారు. మండలంలోని దెందుకూరు రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' సదస్సు సోమవారం నిర్వహించగా ఆమె మాట్లాడారు. యూరియా వాడకాన్ని తగ్గిస్తే ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. అంతేకాక మేలైన విత్తనాల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మధిర ఏడీఏ విజయ్ చంద్ర, ఏఓ సాయిదీక్షిత్, ఏఈఓ ప్రవల్లిక, రైతులు పాల్గొన్నారు.

పురాతన కాలం నాటి రాతిస్తంభం


రాతిస్తంభం వద్ద పరిశోధకులు

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపానికి సమీప పొలంలో కాకతీయుల కాలం నాటిదిగా పలకల రాతి స్తంభాన్ని గుర్తించారు. ఈ అంశంపై తెలంగాణ చరిత్ర బృందం కోకన్వీనర్ కట్టా శ్రీనివాస్, పసుమర్తి శ్రీనివాస్ సోమవారం వివరాలు వెల్లడించారు. భూమిపై రెండు అడుగుల ఎత్తు, అడుగున్నర వెడల్పు, ఎనిమిది అంగుళాల మందంతో ఉన్న రాతి ఫలకం బయటపడిందని తెలిపారు. దీనిపై డమరుకం, త్రిశూలంతో పాటు సూర్యచంద్రుల చిహ్నాలు ఉన్నాయని పేర్కొన్నారు. భూమి నుంచి పూర్తిగా వెలికితీసి పరిశీలిస్తే మరిన్ని ఆధారాలు లభించవచ్చని చెబుతున్నారు.

సింగరేణి క్రికెట్ టోర్నీ విజేత బెల్లంపల్లి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని జయశంకర్ గ్రౌండ్‌లో మూడు రోజులపాటు జరిగిన సింగరేణి ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నీలో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్తగూడెం జట్టుపై విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా విభాగంలో కొత్తగూడెం జట్టు విజేతగా నిలవగా, బెల్లంపల్లి టీమ్ రన్నర్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో జీఎంలు ఎం.శాలేంరాజు, మనోహర్‌తోపాటు కోటిరెడ్డి, పాలడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మెకు జాతీయ సంఘాల మద్దతు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 20న జరిగే సమ్మెకు అన్ని జాతీయ కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నాయని అఖిల పక్షం నాయకులు వెల్లడించారు. కొత్తగూడెం రుద్రంపూర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగినఅఖిలపక్ష సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. అన్ని సంఘాల మద్దతుతో సమ్మెను విజయవంతం చేస్తామని తెలిపారు. ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ, ఇఫ్టూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,058

బాల్‌బ్యాడ్మింటన్‌కు కేరాఫ్‌గా..

- బోనకల్‌లో ఏటా వేసవిలో క్రీడా శిక్షణ శిబిరం
- 22 ఏళ్లుగా కోచ్ లింగయ్య ఆధ్వర్యాన నిర్వహణ
- జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు




బోనకల్‌ని శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులు

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో 22 ఏళ్లగా వేసవిలో బాల్ బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా ఎందరో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటారు. శిబిరాల నిర్వహణ, కఠోర శిక్షణలో కోచ్ అమిరేశి లింగయ్య కీలకంగా నిలుస్తూ క్రీడాకారులకు చేయూతనిస్తున్నారు.

తొలుత యూత్ ద్వారా..

1997లో బోనకల్‌లో శాంతి స్నేహ యూత్‌ను నెలకొల్పిన లింగయ్య బాల్‌బ్యాడ్మింటన్ క్రీడకు జీవం పోశాడు. కనుమరుగవుతున్న సంప్రదాయ క్రీడ అయిన బాల్‌బ్యాడ్మింటన్‌కు ఎలాంటి లాభాపేక్ష లేకుండా సుమారు 200 మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధం చేశాడు. తద్వారా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడకు కేరాఫ్‌గా బోనకల్ నిలుస్తోంది. దాతల సహాయ సహకారాలతో అనేకమంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఇదే గ్రామంలో ఏటా పాఠశాల విద్యార్థులను సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ గ్రూప్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నాడు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా మంచి ప్రావీణ్యత సంపాదించి ఉన్నత చదువులు చదివి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందడం విశేషం.

ప్రస్తుతం 40 మంది..

ఈ ఏడాది 40 మంది క్రీడాకారులతో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. నెలపాటు ఈ శిక్షణా శిబిరం నిర్వహించనుండగా.. ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారులకు ఆటలో మెళకువలు నేర్పుతూ నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు. బోనకల్‌లో రెండు గురుకుల పాఠశాలలు, కస్తూర్బాగాంధీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉండడంతో వేసవి శిక్షణా శిబిరం క్రీడాకారుల తో కళకళలాడుతోంది. అలాగే, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు కూడా ఈ శిక్షణా శిబిరంలోనే తర్ఫీదు పొందడం విశేషం.


క్రీడాకారులకు మెళకువలు నేర్పిస్తున్న కోచ్ లింగయ్య

శిక్షణతో ఉపయోగం



వేసవి శిక్షణా శిబిరం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో అనేక మెళకువలను నేర్చుకోవడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఆడే అవకాశం లభించింది. ఇప్పటివరకు 8 సార్లు రాష్ట్రస్థాయి, 4 సార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

– కె.మధులత

నెల పాటు తర్ఫీదు



వేసవిలో నెలరోజుల పాటు శిక్షణా శిబిరంలో కోచ్ లింగయ్య మంచి తర్ఫీదు ఇస్తారు. ఇప్పటివరకు 6 సార్లు రాష్ట్రస్థాయి పోటీలకు, 3 సార్లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు సంబంధించి సర్టిఫికెట్ రావడంతో ఉద్యోగ అవకాశాలు వస్తాయని భావిస్తున్నాను.

– కె.జశ్వంతి, చొప్పకట్లపాలెం

కఠోరంగా శ్రమిస్తున్నాం..



వేసవి శిక్షణా శిబిరంలో కఠోరంగా శ్రమిస్తున్నాం. ఆటపై మక్కువతో ప్రతిరోజు శిక్షణా శిబిరంలో పాల్గొంటున్నాం. పలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరిక. కోచ్ లింగయ్య ఆటలో ఎన్నో మెళకువలను నేర్పించారు.

– ఊహ, గార్లపాడు

ఆర్టీసీ అభివృద్ధికి ప్రణాళికలు

కరీంనగర్ జోన్ ఈడీ సోలోమన్


ఇల్లెందులో మినీ డీజిల్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఈడీ సోలోమన్, అధికారులు

ఇల్లెందు/చుంచుపల్లి: ప్రయాణికుల సహకారం, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితో ఆర్టీసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్ తెలిపారు. ఇల్లెందు, కొత్తగూడెం బస్టాండ్లు, డిపోలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈడీ డిపోల్లో బస్సుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరా తీశాక మాట్లాడారు. ప్రయాణికుల అవసరాలు తీర్చడమే సంస్థ కర్తవ్యమని, అందులో భాగంగా ప్రతీ మారుమూల ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. డిమాండ్ మేరకు కొత్త రూట్లను ఎంపిక చేసి, ఆదాయం పెంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. బస్టాండ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఇల్లెందు డిపోలో 25 బస్సులు ఉన్నాయని, నిత్యం 9,500 కిలోమీటర్లు ప్రయాణించడం ద్వారా రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందని అధికారులు ఆయనకు వివరించారు. కాగా, ఇల్లెందు బస్ స్టేషన్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు షాపులను తొలగించాల్సి వస్తోందని, వ్యాపారులకు ఇచ్చిన గడువు ముగిసినందున మిగిలిన షాపులను తామే కూల్చివేస్తామని ఈడీ ప్రకటించారు. అలాగే, ఇల్లెందు ఆర్టీసీ డిపోలో డీజిల్ బంక్ ఏర్పాటుచేసే వరకు బస్సులకు ఇంధనం సమకూర్చేలా ఏర్పాటుచేసిన మినీ డీజిల్ మినీ ట్యాంక్‌ను ఆయన పరిశీలించి నిర్వహణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్, డీఎం దేవేందర్‌గౌడ్, డిప్యూటీ ఆర్‌ఎం మల్లయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ టీచర్లకు వేతనాలు చెల్లించాలి

మధిర: 2008 డీఎస్సీ ద్వారా ఎంపికై, ఇటీవల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి వేతనాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మధిరలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 10న విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు వేతనాలు చెల్లించకపోవటం సరికాదన్నారు. అలాగే, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీని 2023 జూలై నుంచి అమలు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుర్‌వలీతో పాటు వినోద్‌రావు, బండారు నాగరాజు, ఇర్రి వీరయ్య, షేక్ ఇబ్రహీం, ఊట్ల శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్, చిట్స్ కార్యాలయాల్లో తనిఖీలు

- చెక్కులు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని పలువురు ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలతో పాటు ప్రైవేట్ చీటీలు నిర్వహించే వారి ఇళ్లలో పోలీసులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజల నుండి భారీగా వడ్డీ వసూలు చేస్తున్నారని, చీటీలు నిర్వహిస్తున్న వారు సమయానికి డబ్బు ఇవ్వడం లేదనే ఫిర్యాదుల నేపథ్యాన ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఖమ్మం అర్బన్ పోలీసు స్టేషన్ల పరిధిలోని వ్యాపారుల ఇళ్లు, ఆఫీసుల్లో 11చోట్ల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రూ.లక్షల విలువైన 120 ఖాళీ చెక్కులు, 570 ప్రామిసరీ నోట్లు, 38 బాండ్లు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. కాగా, తనిఖీల సమాచారంతో కొందరు వ్యాపారులు ఫోన్లు స్విచాఫ్ చేసి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయినట్లు సమాచారం.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఐటీడీఏ పీఓ రాహుల్


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేస్తారని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పోడు, వ్యక్తిగత భూములకు పట్టాలు, రైతుభరోసా, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స కోసం ఆర్థిక సాయం తదితర అవసరాల కోసం గిరిజనులు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. వీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలన్నీ ఆన్‌లైన్‌లో ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, అర్హులకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధికారులు అరుణకుమారి, రవీంద్రనాథ్, భాస్కరన్, వేణు, లక్ష్మీనారాయణ, ఉదయ్, నరేష్, ఆదినారాయణ, నారాయణరావు, హరికృష్ణ, లింగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలుగా అడవుల అభివృద్ధి

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- నీలాద్రి అర్బన్‌పార్క్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం


పెడల్ బోటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ఉమ్మడి జిల్లాలో అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్‌పార్క్‌లో పెడల్ బోటింగ్, లైబ్రరీ, ఆర్వో ప్లాంట్, ఎస్‌బీఎఫ్ మిషన్, వీఎస్‌ఎస్ సభ్యులకు ఉపాధి యంత్రాలను సోమవారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆదిలాబాద్ సమీపంలోని తిప్పేశ్వరం అటవీ పార్క్ మాదిరి సత్తుపల్లి అర్బన్ పార్క్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించారని తెలిపారు. అలాగే, 14 వేల హెక్టార్లలో ఉన్న కనిగిరి గుట్టలను ఎకో టూరిజంలో భాగంగా అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాక పెరుగుతుందని, ఆపై గిరిజనులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. కాగా, అటవీశాఖ వీఎస్‌ఎస్ సభ్యులకు ఉపాధి యంత్రాలను అందించడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో రాజీవ్ యువశక్తి పథకం ద్వారా యంత్రాల పంపిణీ, మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ అడవిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం ఆనందదాయకమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.బీమానాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, మున్సిపల్ కమిషనర్ కు.నర్సింహా, రేంజర్ ఉమ, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, కమల్‌పాషా, దొడ్డా శ్రీనివాసరావు, వందనపు సత్యనారాయణ, మెప్మా టీఎంసీ సుజాత, దీపక్ రామాయణ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి
పచ్చిరొట్ట విత్తనాలు

- ఉమ్మడి జిల్లాలో 4,422 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం
- 50 శాతం మేర సబ్సిడీతో విక్రయం
- పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతుసేవా కేంద్రాల ద్వారా అమ్మకానికి ఏర్పాట్లు


జనుము పంట (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సీజన్ సమీపిస్తున్న వేళ ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో రైతులు దుక్కులు చేస్తున్నారు. ఈ నేపథ్యాన భూసారం పెంపునకు పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లి ఆపై కలియదున్నడం ఆనవాయితీ. ఈక్రమంలోనే వ్యవసాయ శాఖ జీలుగు, పిల్లి పెసర, జనుము తదితర పచ్చిరొట్ట పైర్ల పెంకానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా..

ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల వ్యవసాయ శాఖ నుంచి అందిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ సమకూరుస్తోంది. ఖమ్మం జిల్లాలో జీలుగు 14వేల క్వింటాళ్లు, జనుము 1,500 క్వింటాళ్లు, పిల్లిపెసర 150 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో జీలుగు 5వేల క్వింటాళ్లు, జనుము 400 క్వింటాళ్లు, పిల్లి పెసర 50 క్వింటాళ్లకు కావాలని నివేదిక ఇచ్చారు. ఇందులో ఇప్పటివరకు జీలుగు 3,252 క్వింటాళ్లు, జనుము 1,170 క్వింటాళ్లు కలిపి 4,422 క్వింటాళ్ల విత్తనాలు తెప్పించారు.

సబ్సిడీతో విక్రయాలు

సహజసిద్ధమైన ఎరువు లభించేలా పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. విత్తనాలపై 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది.

విత్తనాల బ్యాగ్ పరిమాణం, ధరలు

విత్తనంబ్యాగ్	(కిలోల్లో)	ధర (రూ.ల్లో)
జీలుగు	30	2,137.50
జనుము	40	2,510.00
పిల్లి పెసర	20	2,055.00

కిలో రూ.142.75 ధర ఉన్న జీలుగు విత్తనాలను రూ.71.25కు, రూ.125.50 ధర ఉన్న జనుము విత్తనాలను రూ.62.75కు, రూ.205.50 ధర ఉన్న పిల్లి పెసర విత్తనాలను రూ.102.50కు విక్రయిస్తారు. ఖమ్మం జిల్లాలోని 75 పీఏసీఎస్‌లు, 13 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, రెండు టీజీఎస్‌డీఎల్, ఒక ట్రేడర్‌తో పాటు భద్రాద్రి జిల్లాలో 20 పీఏసీఎస్‌లు, ఏడు ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఒక ట్రేడర్ ద్వారా విత్తనాలను విక్రయానికి ఏర్పాట్లు చేశారు.

విత్తనాలు సిద్ధం..



ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో వ్యవసాయ శాఖ ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తెప్పిస్తున్నాం. ఇప్పటికే చేరకున్న జీలుగు, జనుము విత్తనాలను నిర్దేశిత కేంద్రాలకు పంపించాం. 50 శాతం సబ్సిడీపై విక్రయించేలా పర్యవేక్షించనున్నాం.

– ఎస్ బీక్షం, విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

బౌద్ధక్షేత్రం అభివృద్ధిపై దృష్టి సారించాలి

సమతా సైనిక్ దక్షిణ భారత అధ్యక్షుడు రాజేష్


సదస్సులో మాట్లాడుతున్న రేజర్ల రాజేష్

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలో కెల్లా అతి పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం సరికాదని సమతా సైనిక్‌దళ్ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు రేజర్ల రాజేష్ పేర్కొన్నారు. బౌద్ధక్షేత్రం వద్ద సోమవారం బుద్ధ జయంతి ఉత్సవలు నిర్వహించగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నాగార్జునసాగర్‌ను అభివృద్ధి చేసిన విధంగా నేలకొండపల్లి క్షేత్రంపైనా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది బుద్ధ జయంతి ఉత్సవాలను లక్షలాది మందితో ఇక్కడ నిర్వహించి, సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని తెలిపారు. కాగా, బుద్ధుడి మార్గాన్ని భవిష్యత్ తరాల వారికి అందించే బాధ్యత అందరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంస్థ వ్యవస్థాపకుడు బైరి నరేష్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పగిడికత్తుల ఈదయ్య, పెద్దపాక వెంకటి,రాజేశ్వరరావు, రవి, సంపత్, బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు.. ఒకరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నేలకొండపల్లి: ఓ కారు అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లగా తృటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని అమ్మగూడెం మీదుగా వెళ్తున్న కారు సోమవారం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ముదిగొండ మండలం మాధాపురానికి చెందిన నాగిరెడ్డి నేలకొండపల్లి వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు దెబ్బతినగా నాగిరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో కూలీ మృతి

పెనుబల్లి: వడదెబ్బ బారిన పడిన వృద్ధుడు మృతి చెందాడు. పెనుబల్లి ఎస్సీ కాలనీకి చెందిన దండు స్వామి(60) రోజు మాదిరిగానే సోమవారం కూలీ పనికి వెళ్లాడు. సాయంత్రం ముత్యాలమ్మ గుడివైపు నడిచి వెళ్తుండగా వడదెబ్బతో అపస్మారక స్థితికి చేరాడు. దీంతో స్థానికులు ఆయనను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.

ప్రేమ చూపడం లేదని మహిళ ఆత్మహత్య

పెనుబల్లి: ఇంట్లో ఎవరూ తనతో ప్రేమగా ఉండడం లేదని మనస్తాపానికి గురైన మహిళ బలవన్మరణానికి పాల్పడింది. పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన తోట అంజమ్మ(40) తనతో కుమారులు, కుటుంబీకులు ప్రేమగా ఉండటం లేదంటూ.. వారిని బెదిరించే క్రమంలో 20 బీపీ మాత్రలు మింగింది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకపోగా, ఆలస్యంగా గమనించిన కుటుంబీకులు పెనుబల్లి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుండి ఖమ్మం ప్రభుత్వ ఆస్పకి తరలించగా అంజమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మానసిక స్థితి సరిగ్గా లేక...

ఖమ్మంక్రైం: మానసికస్థితి సరిగ్గా లేని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మంలోని బోనకల్ క్రాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన యనగండ్ల శ్యామ్‌కుమార్(21) సోమవారం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎర్రుపాలెం: వేగంగా వెళ్తున్న రైలు నుండి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. ఖమ్మం జీఆర్పీఎస్ఐ బి.రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం ... ఖమ్మం నుండి విజయవాడ వైపు వెళ్తున్న రైలు నుండి సదరు వ్యక్తి జారిపడగా తీవ్రగాయాలత మృతి చెందాడు. ఆయన వద్ద ఖమ్మం – విజయవాడ టికెట్ తప్ప ఇతర ఆధారాలు లభించలేదు. నలుపు, తెలుపు గళ్ల షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించిన వ్యక్తి మృతదేహాన్ని మధిర ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58589, 98481 14202 నంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కారేపల్లి: గంజాయితో వెళ్తున్న ఇద్దరిని కారేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాలు... ఇల్లెందుకు చెందిన వలిపెద్ది రాజ్‌కమల్, కొత్తగూడెంలోని చుంచుపల్లికి చెందిన కుంజా దిలీప్ చెరో కేజీ గంజాయి సంచులతో ఖమ్మం వెళ్లేందుకు సోమవారం కారేపల్లి వద్ద వేచి ఉన్నారు. ఈక్రమంలో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎస్.రాజారాం ఆ మార్గంలో వెళ్తుండగా పోలీసులను చూసిన రాజ్‌కమల్, దిలీప్ పరుగు పెట్టారు. దీంతో వెంబడించి పట్టుకోగా, రెండు కేజీల గంజాయి లభించింది. ఇల్లెందుకు చెందిన రాజ్‌కమల్ 2017లో సోలార్ ప్లాంట్ వద్ద జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు కాగా, బెయిల్‌పై వచ్చాక కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం దిలీప్‌తో కలిసి ఆయన గంజాయి తీసుకెళ్తూ పట్టుబడ్డాడు.